# ఆహార ఉత్పత్తులకే 70 శాతం నీటి వినియోగం

## • హెచ్ఎండీఏ పరిధిలో పరిస్థితి

ఈనాడు, సంగారెడ్డి: నీటి వినియోగం ప్రధానాంశంగా హైదరాబాద్ మహా నగరాభివృద్ధి ప్రాధికార సంస్థ(హెచ్ఎండీఏ) పరిధిలో పరిశోధనలను ఐఐటీ-హైదరాబాద్ కొనసాగిస్తోంది. అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా ఏడాది నుంచి వారు విశ్లేషణలు జరుపుతున్నారు. అధికారులు విడుదల చేసిన ప్రకటన ప్రకారం- తొలి దశలో ఆహార ఉత్పత్తులు, విద్యుత్, శిలాజ ఇంధనాలు, తాగునీరు.. ఈ నాలుగు అంశాలనూ తీసుకున్నారు. పరోక్షంగా వాడుకునే జలాలను 'వర్చువల్ వాటర్'గా పేర్కొన్నారు. కూరగాయలు, ధాన్యాలను పండించడం, విద్యుదుత్పత్తి వీటన్నింటి కోసం వినియోగించే జలాలనే ఇలా పిలుస్తుంటారు. వ్యవసాయ అవసరాల కోసం 70 శాతం నీళ్లను వాడుతుంటాం. అదే పట్టణ ప్రాంతాల్లో వర్చువల్ వాటర్ వినియోగం అత్యధికంగా ఉంటోందని పరిశోధకులు గుర్తించారు.



పరిశోధన బృందంలోని ఆచార్య డి.చంద్రశేఖరం, విద్యార్థి డి.కోటేశ్వర్‌రావు

హెచ్ఎండీఏ పరిధిలోని ప్రజలు 96 శాతం ఆ జలాలనే వినియోగిస్తున్నారని తేల్చారు. నాలుగు శాతం జలాలను మాత్రమే నేరుగా తాగునీటి రూపంలో తీసుకుంటున్నారన్నారు. పరిశోధక బృందంలో ఐఐటీ హైదరాబాద్‌లోని సివిల్ ఇంజినీరింగ్ విభాగం విజిటింగ్ ప్రొఫెసర్ దోర్నాదుల చంద్రశేఖరం, పరిశోధక విద్యార్థి డి.కోటేశ్వర్‌రావు ఉన్నారు.